క్లుప్తంగా

మావుళ్లమ్మవారికి బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన ఎం.మోహన్‌బాబు, శ్రావణి దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొప్పేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



భీమవరంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఏర్పాటుచేసిన బొమ్మలకొలువు

భీమవరం: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా సోమవారం భీమవరంలోని బొండా రాంబాబు, లక్ష్మీరమణ దంపతులు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎస్ఆర్ కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ పి సుబ్బారావు మాట్లాడుతూ బొమ్మల కొలువులు ఏర్పాటు చేయడం శుభ పరిణామమని అన్నారు. రాయప్రోలు భగవాన్, కారుమూరి సత్యనారాయణ, పరుచూరి నాగేశ్వరరావు, కొండేటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జార్జ్‌రాజుకు అవార్డు

ఉండి: మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని సోమవారం విజయవాడలో మదర్స్ సర్వీసెస్ సొసైటీ సేవా సంస్థ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బందెల జార్జ్‌రాజుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు, ఆయన భార్య ప్రమీలకు మదర్ థెరిస్సా అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. ఎన్‌జీవోస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి ఎం ప్రసాదరావు అవార్డులు ప్రదానం చేశారని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో విద్యకు దూరం కావద్దు

భీమవరం: ఆర్థిక ఇబ్బందులతో విద్యకు దూరమవుతున్న ప్రతిభావంతులకు దాతలు సహకరించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పట్టణంలోని ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కుమారులు 7, 3 తరగతులు చదువుతున్న ఎస్ కెన్నిత్, ఎస్ కోమల్ విద్యార్థుల కోసం అపార్ట్‌మెంట్ వాసులు సమకూర్చిన రూ.25 వేలును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. చెరుకువాడ రంగసాయి, చల్లారావు, టీవీవీ ప్రసాద్, బంగార్రాజు, జవ్వాది శ్రీనివాస్, బాపిరాజు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు గిడుగు

భీమవరం (ప్రకాశంచౌక్): గిడుగు రామ్మూర్తి తెలుగు భాషకు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, తెలుగు భాషాభివృద్ధి సంఘం సంయుక్త అధ్వర్యంలో భీమేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, భాషోద్యమ నాయకులు గిడుగు రామమూర్తి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు మహాకవుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్య వైశ్యుల యువజన సంఘ నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, నాటక ప్రయోక్త, కళారంజని నాటక అకాడమి అధ్యక్షుడు జవ్వాది శ్రీనివాస్, తెలుగు పండితులు కలిగొట్ల గోపాల శర్మ, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరించారు. అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఉండపల్లి రమేష్ నాయుడు, వారణాసి రాధాకృష్ణ, మెంటే పూర్ణచంద్రరావు, కొత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పనుల అడ్డగింపు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలో గూట్లపాడులో కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావుకు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయానికి సంబంధించి సరిహద్దులో ఫెన్సింగ్ పనులను సోమవారం పంచాయతీ కార్యదర్శి జేవీ సత్యనారాయణ, వీఆర్వో ఆర్ రత్నంరాజు అడ్డుకుని నిలిపివేశారు. శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి ఆలయ గోపుర నిర్మాణ పనులు వివాదంలో ఉండటంతో ఈ పనులను నిలిపివేశారు. సరిహద్దులో ఉన్న కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ సొంత స్థలంలో ఫెన్సింగ్ నిర్మించుకుంటుంటే పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో అడ్డుకున్నారని తెలిపారు. కార్యదర్శి మాట్లాడుతూ ఆలయ గోపుర నిర్మాణం వివాదంలో ఉందని దాని సరిహద్దులోని స్థల విషయమై సర్వే చేయించుకున్న అనంతరం ఫెన్సింగ్ నిర్మించుకోవాలన్నారు.

డ్రైక్లీనింగ్ షాపు దగ్ధం

భీమవరం: భీమవరంలోని సుంకరపద్దయ్యవీధిలో ఓ డ్రైక్లీనింగ్ షాపులో సంభవించిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ. 30 వేలు నష్టం ఏర్పడిందని ఫైర్‌ఆఫీసర్ సీహెచ్ సూర్యప్రకాశరావు సోమవారం చెప్పారు. సుంకరపద్దయ్య వీధిలోని గ్రంధి వెంకట్రావుకు చెందిన భవనంలో పి బాలాజీ కొంతకాలంగా డ్రైక్లీనింగ్ షాపు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నట్లు సూర్యప్రకాశరావు చెప్పారు.



ప్రత్యేక చట్టం తేవాలి



సమస్య ఏదైనా, రోగం ఎంత ప్రమాదకరమైనా ప్రాణాలకు తెగించి రోగుల ప్రాణాలు కాపాడుతున్న మా ప్రాణాలనే కొందరు దుర్మార్గులు తీస్తున్నారు. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు డాక్టర్లు ఎంతో శ్రమిస్తున్నారు. డాక్టర్లతో పాటు సిబ్బంది ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. పీహెచ్‌సీలు 24 గంటలు పని చేయాలంటున్నారు కాని రాత్రి డ్యూటీలో ఉన్న వారికి రక్షణ కల్పించడం లేదు. పీహెచ్‌సీల వద్ద నైట్‌వాచ్‌మెన్‌ను పెట్టాలి. వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి.

– డాక్టర్ సాయిచంద్ర, మండల వైద్యాధికారి, ఉండి

మహిళలను గౌరవించాలని నేర్పించాలి



తల్లిదండ్రులు ఆడపిల్లల్ని ఎన్నో నిబంధనలు పెట్టి పెంచుతారు. మగ పిల్లలను సమాజం పట్ల బాధ్యతగా మెలిగేలా పెంచాలి. ఇంట్లో తల్లిని, చెల్లిని, అక్కను గౌరవించినట్లే సమాజంలోని ఆడవారిని గౌరవించాలని నేర్పించనంతకాలం మన సమాజం ఇలానే ఉంటుంది. ఏదైనా అఘాయిత్యం జరిగినప్పుడు ధర్నాలు, నిరసనలు, కొవ్వొత్తుల ర్యాలీలు చేయడం కాదు సభ్యసమాజం పట్ల మగపిల్లలకు బాధ్యత, మర్యాదను నేర్పించినప్పుడే ప్రతి ఆడబిడ్డకు రక్షణ లభిస్తుంది.

– డాక్టర్ లక్ష్మీసునంద, ఉండి పీహెచ్‌సీ వైద్యురాలు

వీధులు అపరిశుభ్రం.. ప్రజలకు అనారోగ్యం

- భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో పారిశుధ్యం అధ్వానం
- రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త
- పూడుకుపోయిన డ్రెయినేజీలు
- దోమల బెడద, దుర్వాసనతో ప్రజల అవస్థ



భీమవరం: గొల్లవానితిప్పలో పేరుకుపోయిన చెత్త



భీమవరం: గొల్లవానితిప్పలో గునుపూడిలో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ

భీమవరం: భీమవరం నియోజకవర్గంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎక్కడా చూసినా చెత్తకుప్పలు, డ్రెయినేజీ సక్రమంగా పారకపోవడంతో తీవ్ర దుర్గం మధ్య దోమల బెడదతో కంటిమీద కునుకు ఉండటం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్లెల రూపురేఖలు మారుస్తామంటూ గొప్పలు చెబుతున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాటలు కోటలు దాటుతుంటే పనులు ఆచరణలో చూపడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామీణాభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించినట్లు ప్రభుత్వం చెబుతున్నా పంచాయతీల్లో మాత్రం కనీసం వీధులను శుభ్రం చేయించడానికి కూడా నిధులేవంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. భీమవరం నియోజకవర్గంలోని వీరవాసరం మండలంలో 23, భీమవరం మండలంలో 22 గ్రామ పంచాయతీలుండగా భీమవరం పట్టణంలో 39 వార్డులున్నాయి. భీమవరం పట్టణంతోపాటు రెండు మండలాల్లోని ఏ గ్రామంలోనూ డంపింగ్ యార్డులు లేకపోవడంతో మురుగుకాలువల గట్లు, రోడ్ల పక్కన, శ్మశానాలు, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను డంపింగ్ చేస్తున్నారు. మేజర్ పంచాయతీల్లో మినహా మిగిలిన గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు తగినంతగా లేకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తోంది. మేజర్ పంచాయతీల్లోనూ చెత్తను దూర ప్రాంతాలకు తరలించకుండా రోడ్ల పక్కనే తగలబెట్టడం పరిపాటిగా మారింది. ప్రధాన రోడ్లు వెంబడి సైతం డ్రెయిన్లు సక్రమంగా లేకపోవడంతో మురుగునీరంతా రోడ్లపైనే ప్రవహిస్తోంది.

రోగాలతో సతమతం

గ్రామాలు, పట్టణంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో అనేకమంది రోగాల బారిన పడుతున్నారు. అసలే వర్షాకాలం ఆపై అపరిశుభ్రత కారణంగా డెంగీ, వైరల్ ఫీవర్స్‌తోపాటు జలుబు, దగ్గు, ఒంటి నొప్పులతో అనేక మంది అనారోగ్యంపాలై ఆసుపత్రులు చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పట్టణం, గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నారు.

భయమేస్తోంది



మాది ఆకివీడు గ్రామం. జ్వరంతో బాధపడుతున్నాను. జ్వరం తగ్గకపోవడంతో భయమేస్తోంది. మా నాన్నకు చెప్పడంతో ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యం అందించారు. జ్వరంతో ఒణుకు వస్తోంది.

–ప్రేమ్‌కుమార్, బాలుడు, ఆకివీడు

జ్వరంతో బాధపడుతున్నాను



రెండు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాను. ఆకివీడు సీహెచ్‌సీలో ఇన్‌పేషంట్‌గా చేరి వైద్యం పొందుతున్నాను. ఇప్పుడు కొద్దిగా తగ్గింది. నీరసంగా ఉంది. డాక్టర్ మందులు ఇచ్చి సిలైన్లు ఎక్కించారు.

–కె.రత్నకుమారి, ఆశా వర్కర్, గుమ్ములూరు, ఆకివీడు మండలం

దోమల కారణంగా జ్వరాలు



దోమల కారణంగా జ్వరాల బారిన పడ్డాను. జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులు తగ్గలేదు. నీరసం తగ్గక నడవలేని పరిస్థితిలో ఉన్నాను. ఎన్నార్పీ అగ్రహారంలో పారిశుధ్య పనులు మెరుగుపరచి, దోమల నివారణ మందులు పిచికారీ చేయాలి.

– జల్లి మరియమ్మ, ఎన్నార్పీ అగ్రహారం, ఉండి మండలం

దుంపగడప రూటే వేరు

ఆకివీడు మండలంలోని దుంపగడపలో జ్వర పీడితులు ఈ నెలలో 90 మంది అధికారిక లెక్కల ప్రకారం ఉన్నారు. అనధికారికంగా మరో 100 మందికి పైగా జ్వరంతో బాధపడుతున్నారు. ఉప సర్పంచ్ నాగరాజుకు జ్వరం తగ్గిన తరువాత కాలు ఉబ్బిపోయి, పొలుసు వచ్చి తీవ్ర ఇబ్బందికి గురిచేస్తోంది. ఇదే పరిస్థితి గ్రామంలో చాలా మంది అనుభవిస్తున్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. శనివారం జ్వరంతో టెన్త్ విద్యార్థిని లహరి మృతి చెందిన విషయం విదితమే.

వణుకుతున్న ప్రాణాలు.. విజృంభిస్తున్న దోమలు



ఉండి: రోడ్మెక్కిన మురుగునీరు



ఆకివీడు: సిద్ధాపురం రహదారి పక్కనే చెత్త కుప్ప



ఆకివీడు: దోమలకు నిలయంగా గంగానమ్మకోడు డ్రెయినేజీ



ఆకివీడు: పూడుకుపోయిన డ్రెయిన్

ఆకివీడు: జ్వరాలు వ్యాపించడంతో ప్రజలు చిగురుటాకుల్లా ఒణికిపోతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు చుట్టూ తిరుగుతున్నారు. మందుల షాపుల వద్ద జనం క్యూ కడుతున్నారు. గ్రామాల్లోనూ, మండల కేంద్రం, నగర పంచాయతీ పరిధిలోనూ అపరిశుభ్రత పేరుకుపోయింది. రోడ్లపై చెత్త పేరుకుపోయింది. డ్రెయినేజీలు పూడికతో అస్తవ్యస్తంగా ఉన్నాయి.

విపరీతంగా పెరిగిన దోమల బెడద

దోమల నివారణ మందు పంచాయతీలు పిచికారీ చేస్తున్నట్లు చెబుతున్నా ప్రజలపై దోమల దండయాత్ర తప్పడంలేదు. దోమల నివారణకు, వ్యాధులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. డ్రోన్ల ద్వారా దోమల మందు పిచికారీ చేయిస్తామంటూ ప్రభుత్వ కాలయాపన చేస్తోంది. ఆకివీడు నగర పంచాయతీలోని మూల లంక బోదె, అందేవారి బోదె, గంగానమ్మకోడు డ్రెయిన్లు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. ఉండి నియోజకవర్గంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఆకివీడు నగర పంచాయతీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో డ్రెయినేజీలు అధ్వానంగా తయారయ్యాయి. కచ్చా డ్రెయిన్ల నుంచి మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. ఉండి మండలంలోని ఉండి, ఎన్నార్పీఅగ్రహారం, పాందువ్వ, అర్తమూరు, వాండ్రం, ఉప్పుగూడెం వెళ్లే రహదారి, పాలకోడేరు మండలంలోని పాలకోడేరు, శృంగవృక్షం, పెన్నాడ, మోగల్లు, గొల్లలకోడేరు, వేండ్ర, కాళ్ల మండలంలోని కాళ్లకూరు, కాళ్ల, దొడ్డనపూడి తదితర గ్రామాల్లోనూ అపరిశుభ్రత నెలకొంది.

వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు వద్దు



భీమవరంలో రైతు సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జమలయ్య

భీమవరం: వ్యవసాయ విద్యుత్ మోటర్స్‌కు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని, 2022 విద్యుత్ బిల్లును కేంద్రం రద్దు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జమలయ్య డిమాండ్ చేశారు. సోమవారం భీమవరంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లుల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రైతులకు తక్షణమే ఎకరాకు రూ. 20 వేలు పెట్టుబడి సాయమందించాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ. 2లక్షల లోపు ఉన్న రుణాలను మాఫీ చేయాలని కోరారు. ముందుగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైవీ ఆనంద్ కార్యకలాపాల నివేదికను సమర్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల డిపాజిట్ల సొమ్ము చెల్లించాలి



భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబుకు వినతిపత్రం అందిస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

భీమవరం: అగ్రిగోల్డ్ బాధితుల డిపాజిట్ల సొమ్ము చెల్లించి న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు)కు సోమవారం అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. అగ్రిగోల్డ్ సంస్థ పదిన్నర లక్షల మంది బాధితులకు రూ. 3,080 కోట్లు చెల్లించాల్సి ఉందని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం బ్రాంచి గౌరవాధ్యక్షుడు ఎం సీతారాంప్రసాద్, అధ్యక్షుడు కె గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలి

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం అందిస్తున్న సమాజిక వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్ఎస్ రావు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు)ను కోరారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సంఘం సభ్యులు ఎస్ రంగారావు, నాగరాజు, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి రూ.3 వేలు అందిస్తాం

భీమవరం మన్నా చర్చి ఆవరణలో సోమవారం మన్నా యూత్ ఆధ్వర్యంలో యూత్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యువతకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. సంఘ కాపరి దేవదాసు, అసిస్టెంట్ పాస్టర్లు సన్నీ జోసెఫ్, సారా గ్రెస్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

లహరి మరణం ప్రభుత్వ వైద్య వ్యవస్థ దుస్థితికి నిదర్శనం

ఆకివీడు: జ్వర పీడితురాలు దుర్గా లహరి మరణం ప్రభుత్వ వైద్య వ్యవస్థ దుస్థితికి నిదర్శనమని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు జెఎన్వీ. గోపాలన్ చెప్పారు. మండలంలోని దుంపగడపలో జ్వరంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం గ్రామంలో సీపీఎం ధర్నా చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలిక మృతి చెందనట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. సీపీఎం నాయకులు కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, రవి తేజ పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ సురక్షిత తాగునీరు

కాళ్ల: గ్రామాల్లోని ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందిస్తామని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన జల్ జీవన్ మిషన్ నిధులు రూ.70.70 లక్షలతో నూతనంగా నిర్మించిన రెండు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను సోమవారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ కొల్లి సుబ్బారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



రాయకుదురులో ఉట్టి కొడుతున్న దృశ్యం

భీమవరం అర్బన్: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం మండలంలోని వెంప, దిరుసుమర్రు, యనమదుర్రు, గొల్లవానితిప్ప, బేతపూడి, తాడేరు, కొత్తపూసలమర్రు, లోసరి, బరువానిపేట, అనాకోడేరు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి ఉట్టిని కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉండిలో..

ఉండి: శ్రీకృష్ణాష్టమి వేడుకలు మండల వ్యాప్తంగా భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉండి కొత్తపేటలోని కృష్ణాలయంలో కృష్ణాష్టమి వేడుకలు మరింత సంబరంగా నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి స్వామివారిని ఎద్దుల బండిలో గ్రామంలోని ప్రధాన రహదారుల్లో వైభవంగా ఊరేగించారు.వేణుగోపాల యాదవ సంఘ ఆధ్వర్యంలో ఉండి పుర వీధుల్లో మేళతాళాలతో స్వామి వారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. వీధుల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలను ఆయా ప్రాంతాల నిర్వాహకులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

ఉత్సాహంగా ఉట్టి కొట్టిన యువత

వీరవాసరం: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా గ్రామాల్లోని వీధి వీధిన ఉట్టి మహోత్సవాన్ని సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. యువతతో పాటు పెద్దలు సైతం ఉట్టి మహోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరవాసరం రాయకుదురు, మత్స్యపురి, తోలేరు, తోకలపూడి, నవుడూరు, కొణితివాడ నందమూరి గరువు పెరికిపాలెం చింతల కోటిగరువు పంజా వేమవరం తదితర గ్రామాల్లో ఉట్టి మహోత్సవాల్ని వేడుకగా నిర్వహించారు.

శ్రీకృష్ణునికి లక్ష తులసి పూజ

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీకృష్ణాష్టమి సందర్భంగా భీమవరం గునుపూడి బంట్రోతు వారి వీధిలోని వేణుగోపాల స్వామి మందిరంలో 52వ వార్షిక మహోత్సవంలో భాగంగా శ్రీకృష్ణునికి లక్ష తులసి పూజ నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి లక్ష తులసి పూజ చేశారు.

గ్రామాల్లో యువత సందడి

కాళ్ల: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను కాళ్ల మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. పెదఅమీరంలోని రాధాకృష్ణ మందిరంలో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, యాదవ సంఘం ఆధ్వర్యంలో జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా నిర్వహించారు. కాళ్ల, దొడ్డనపూడి, కోపల్లె, బొండాడ, బొండాడపేట, ఎల్ఎన్ పురం, కలవపూడి, ఏలూరుపాడు, జువ్వలపాలెం, కాళ్లకూరు గ్రామాల్లో కృష్ణాష్టమి సందర్భంగా కృష్ణాష్టమి సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులను కృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించి సందడి చేశారు. గ్రామాల్లో సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని యువత ఉత్సాహంగా నిర్వహించారు.

సేవకు ప్రతిరూపం మదర్ థెరిస్సా



ఉండి పీహెచ్‌సీ వద్ద పండ్లు, రొట్టెలు పంచుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు



సీహెచ్‌సీలో వైద్య సిబ్బందిని సత్కరిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ, డీసీహెచ్ఎస్

ఉండి: సేవకు ప్రతిరూపం భారతరత్న మదర్ థెరిస్సా అని లయన్స్ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరారాజు అన్నారు. సోమవారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ముందుగా మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు, మండల వైద్యాధికారి, పీహెచ్‌సీ డాక్టర్ సాయిచంద్ర మాట్లాడుతూ అందరూ విశ్వమాత మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకుని సేవలందించాలని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ గాదిరాజు రంగరాజు,సభ్యులు రుద్రరాజు నరసరాజు,బొండాడ కేశవరావు, నంబూరి కాశీవిశ్వేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారులు,సిబ్బంది పాల్గొని మదర్ థెరిస్సా సేవలను కొనియాడారు.అనంతరం ఉండి జెడ్పీ హైస్కూల్లోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద పూలమాలలు వేసిన క్లబ్ ప్రతినిధులు నివాళులర్పించారు.

సెంట్‌మేరీస్ హాస్పిటల్ వద్ద ..

భీమవరం: లయన్స్ క్లబ్ అధ్వర్యంలో సోమవారం భీమవరంలోని సెంట్‌మేరీస్ హాస్పిటల్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లైయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మూర్తిరాజు, గోపిశెట్టి మురళీకృష్ణారావు, కోఆర్డినేటర్ నడింపల్లి మహేష్ కుమార్‌వర్మ, డైరెక్టర్ నందమూరి రాజేష్, కోయ కిషోర్, వేగిరాజు విశ్వనాథరాజు, నేరేడుమిల్లి మహేష్, పేరిచర్ల కృష్ణంరాజు, పులగం మధు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా ఆశయ సాధనకు కృషి

ఆకివీడు: మదర్ థెరిస్సా ఆశయ సాధనలో వైద్య, ఆరగ్యో సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు, డీసీహెచ్ఎస్ పగడాల సూర్యనారాయణ చెప్పారు. స్థానిక సీహెచ్‌సీలో మదర్ థెరిస్సా విగ్రహం వద్ద ఆమె జయంతి వేడుకలను లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేఎల్ నర్సింహం తదితరులు థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అభయ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎండీ.జక్కీ, ఆదర్శ క్లబ్ కార్యదర్శి మోరా జ్యోతిరెడ్డి, కేఎం. నాగరాజు, సూపరింటెండెంట్ అజ్మీనా నజరిన్, వైద్య సిబ్బంది, లయన్స్ సిబ్బంది పాల్గొన్నారు.